4 | నమస్తే తెలంగాణ
హైదరాబాద్
ఆదివారం 10 మార్చి 2024
www.ntnews.com

# చె లి మె

తెలంగాణ ప్రజలకు భాష ఓ పిలుపు మాత్రమే కాదు. చరిత్ర మారినా చెదరని అస్తిత్వం. అందుకే తెలంగాణ ఘన సాహిత్యానికి పెద్దపీట వేస్తూ చెలిమెను నిర్వహిస్తున్నది మన పత్రిక. అలిసిసొలసిన వేళల్లో కళారూపాలైనా, పోరుబాటల్లో పాటలా మారినా, ఆత్మగౌరవాన్ని కథతో నినదించినా... తనదైన శైలి తెలంగాణది. ఆ సాహిత్యంలో మీకు ఎలాంటి అభిరుచి ఉన్నా, కలాన్ని కదిలించండి. ఆసక్తిగా, సూటిగా తెలంగాణ సాహిత్యానికి సంబంధించిన రచనలు చేయండి... editpage@ntnews.com

# కాళీపట్నం కట్టిన కథల గుడి

కాళీపట్నం రామారావు మాస్టారు తన తరంలో అందరికంటే పెద్దవారేం కాదు. కానీ, వయసుకు మించిన పెద్దరికంతో మెలిగే వారాయన. తెల్లని దుస్తుల్లో ఎప్పుడూ నింపాదిగా స్పందించే మాస్టారును, ఆయన కంటే చిన్నవారే కాదు, పెద్దవారు సైతం గౌరవించేవారు. అందుకే ఆ దేవుడికి గానీ మాస్టారు ఎదురుపడితే, ఆయన కూడా మాస్టారుకు నమస్కరిస్తాడని ప్రముఖ కథా రచయిత రావిశాస్త్రి వ్యాఖ్యానించారు.

ఆ ధవళ గాంభీర్యం వెనుక సముద్రమంత కల్లోలం దాగి ఉన్నదని చాలా కొద్దిమందికి మాత్రమే తెలుసు. ఓ మామూలు గ్రామ కరణం ఇంట్లో ఐదుగురు సంతానంలో పెద్ద వాడిగా జన్మించిన మాస్టారిది స్థితిమంతుల కుటుంబం కాకపోయినా, చిన్నతనంలో బాధ్యతలేం పెద్దగా భుజాలకెక్కలేదు. అందరి పిల్లల్లాగే అల్లరి అలవాటు కావడంతో తండ్రి ఆయనను ఆట కట్టించే ప్రయత్నం చేశారు. మాస్టారి చదువు బాధ్యతను ఆయన మాస్టార్లకే అప్పగించారు తండ్రి. దాంతో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నంలలో పలువురి సహాయ సహకారాలతో చదువు కొనసాగించారు. పదో తరగతి పూర్తయిన తర్వాత జబ్బు చేయడంతో స్వగ్రామం మురపాక చేరుకున్నారు. అప్పుడే అక్కడి రామకృష్ణ గ్రంథాలయంలోని పుస్తకాలతో సావాసం ఏర్పడింది. ఆంధ్ర పత్రికలు, భారతులు, డిటెక్టివ్ నవలలు, మను చరిత్ర, వసు చరిత్ర, తిరుపతి వేంకటకవుల గ్రంథాలు, వేయి పడగలు ఒక్కటేమిటి అన్నింటినీ నమిలిపారేశారు. అక్కడి నుంచి అన్వేషణ ప్రారంభమైంది. జీవిత పరమార్థం ఏమిటి? అని చింతన మొదలై ఇల్లొదిలి పారిపోయారు. కానీ, రెండ్రోజుల్లో తిరిగి వచ్చేశారు. తర్వాత చిత్రలేఖనంపై ఆసక్తి పెరిగి కొన్నేండ్ల పాటు విస్తృతంగా బొమ్మలు వేశారు. చదువు నిమిత్తం వివిధ ప్రాంతాల్లో తిరిగిన మాస్టారు చివరికి విశాఖపట్నం చేరుకున్నారు. అక్కడి హిందూ రీడింగ్ రూంలోని పుస్తకాల ద్వారా చలం, విశ్వనాథ, శ్రీపాద తదితరులు పరిచయమయ్యారు. దాంతో ఆయనలో మళ్లీ కల్లోలం మొదలైంది. ప్రపంచం గురించీ, జీవిత లక్ష్యం గురించీ ఆలోచిస్తూ వేదాలు చదువాలని మరోసారి ఇల్లు వదిలిపెట్టి వెళ్లిపోయారు. రాజమండ్రి వేద పాఠశాలలో చేరాలనుకున్నారు. కానీ, ఎందుకనో ఆ ప్రయత్నాలు విరమించుకొని మళ్లీ ఇల్లు చేరుకున్నారు. అప్పటి నుంచి రచనా వ్యాసాంగం ప్రారంభించారు. ఆయనలోని ఆలోచనాధారను బయటకు ఉరికించడానికి కథ ఒక వాహిక అయింది. అయినా, ఆయన కుదురుగా ఉండలేకపోయారు. వచ్చిన ఉద్యోగాలు వదిలేశారు. రాని ఉద్యోగాల కోసం ప్రయత్నాలు చేశారు. పెళ్లయినా ఊళ్లు పట్టు కుతిరిగారు. చివరికి సెయింట్ ఆంథోనీ స్కూలులో ఉపాధ్యాయుడిగా చేరి, అక్కడే పదవీ విరమణ చేశారు.

కథా నిలయం అనేది తెలుగు సాహిత్యంలో ఒక మహా నిర్మాణం. ఏ భారతీయ భాషల్లో, ఏ ప్రక్రియకూ ఇటువంటి ఏర్పాటు లేకపోవడం తెలుగువారు గర్వపడాల్సిన విషయం. తొంబై శాతం మంది తెలుగువారికి ఈ విషయం తెలియకపోవడం సిగ్గుపడాల్సి విషయం.



ఆ మధ్య కాలంలో సాహిత్య, సాంస్కృతిక, రాజకీయ రంగాల్లో పెను తుపానులు చెలరేగాయి. అవన్నీ కాళీపట్నం రామారావు మాస్టారి కథలకు నేపథ్యమయ్యాయి. జాతీయ వాదం, అభ్యుదయం, నక్సలిజం, విప్లవం తదితర భావాలు సాహిత్యంలోకి వెల్లువెత్తాయి. విచిత్రం ఏమంటే, విప్లవ రచయితల సంఘం ఏర్పడి, విప్లవ రాజకీయాలు తెలుగు సాహిత్యాన్ని శాసిస్తున్న తరుణంలో మాస్టారు అస్త్ర సన్యాసం చేశారు. 1973 తర్వాత ఆయన కథలేమీ రాయలేదు. రెండు దశాబ్దాల తర్వాత 'సంకల్పం' అనే కథ రాశారు. బాధ్యతలు స్వీకరించాల్సిన వయసులో సత్యాన్వేషణ చేసిన ఫలితంగా అప్పుడు ఆయన భుజాలు బరువెక్కాయి. ఒకవైపు తల్లిదండ్రుల మరణాలు, పిల్లల వివాహాలు, అనారోగ్యాలు ఆయనను కథా రచన వైపు దృష్టిమరల్చనీయలేదు. అయితే, పలు విలువైన కథా సంకలనాలు ప్రచురించి కథా సాహిత్యానికి తనదైన చేర్పు చేశారు. వీటితోపాటు నేటి 'కథ' శీర్షిక నిర్వహణ, కథా కథనం, కథలెలా రాస్తారు, కథలెందుకు రాస్తారు వంటి విలువైన ప్రచురణలు వెలువరించారు. కథల మాస్టారుగా తన స్థాయిని చాటిచెప్పారు. ఈ క్రమంలోనే ఎన్నో అవార్డులు, రివార్డులు స్వీకరించారు.

తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ ఆ మొత్తాలను తన వ్యక్తిగత అవసరాలకు ఆయన వాడుకోలేదు.

రావిశాస్త్రి మీద అభిమానంతో ఆయన పేరిట గ్రంథాలయం నెలకొల్పాలని, ఒక బస్ షెల్టర్ ఏర్పాటుచేయాలని తొలుత అనుకున్నప్పటికీ తనను ఇంతవాడిని చేసిన కథకే ఒక ఆలయం నిర్మించాలని నిర్ణయించుకున్నారు. అలా 22 ఫిబ్రవరి 1997న కథా నిలయం భవనానికి ప్రారంభోత్సవం జరిగింది. ఎలాంటి నిబంధనలూ విధించుకోకుండా మొత్తం కథలను ఒకచోట చేర్చాలని కాళీపట్నం రామారావు మాస్టారు ప్రతినబూనారు. అహరహం శ్రమించి చాలావరకు సాధించారు. ఆయన హయాంలోనే ఏర్పాటైన ట్రస్టు ఇప్పుడు అదే బాధ్యతలతో తలమునకలుగా ఉంది.

కథా నిలయం అనేది తెలుగు సాహిత్యంలో ఒక మహా నిర్మాణం. ఏ భారతీయ భాషల్లో, ఏ ప్రక్రియకూ ఇటువంటి ఏర్పాటు లేకపోవడం తెలుగువారు గర్వపడాల్సిన విషయం. తొంబై శాతం మంది తెలుగువారికి ఈ విషయం తెలియకపోవడం సిగ్గుపడాల్సిన విషయం. తెలుగు కథను ఒకచోట చేర్చి, ఒక ఉనికి కల్పిస్తున్న వారితో భుజం కలపటం ప్రతి తెలుగువాడి గురుతర బాధ్యతను అందరూ గుర్తించాలని ఆశిద్దాం.

(కాళీపట్నం రామారావు శత జయంతి సంవత్సరం సందర్భంగా..)



దేశరాజు
99486 80009

## మట్టి పిల్ల!

పిల్ల తట్టతో మట్టి మోస్తూ
అంతస్తులు అంతస్తులు అలసట లేకుండా
అధిరోహిస్తోంది రెక్కలున్నట్టే!
గంధర్వ కన్యలా పైపైకి ఎగిరిపోతున్నట్టుంది
యానిమేషన్ కాదు నిజంగానే!

ముసలోల్లు, వయసోళ్లు, ఉన్నోల్లు, లేనోల్లు
మట్టి పిల్లను ఆశ్చర్యంగా చూస్తున్నారు!
పనిమంతురాలు మరి!
ఒంటి నిండా ఎర్రమట్టి రాలి రంగోలి!




పిల్లవి చిరుగుల బట్టలైనా
నూనె లేని వెంట్రుకలైనా
మట్టి పిల్ల శ్రమ సౌందర్యంతో దేవకాంత
లాగే ప్రత్యక్ష ప్రమాణం!
శ్రమ అందాన్ని గుర్తించిన వాడెవడైనా
ఈ ప్రపంచంలో గనక ఉంటే
స్వయంవరంగా మట్టి పిల్లను తప్పక లగ్గం
చేసుకుని మట్టి పిల్లను మణిగా లోకోత్తరం
చేస్తాడు!

ఆకాశం మట్టి పిల్లను తాకి ఇంద్రధనువు!
గాలి మట్టి పిల్లను తాకి సౌగంధికం!
అగ్ని నిలువెత్తు ఆమె తేజస్సే!
నీరు నీరంతా ఆమె స్వేద జలపాతం!
ఇక మట్టితో ఆమె పుట్టి పెట్టినట్టు భూదేవే!
మట్టి పిల్ల పేద కాదు
శ్రమ సౌందర్యంతో మూర్తీభవించిన
విశ్వసుందరి



కందాళై రాఘవాచార్య
87905 93638


## వాన జల్లుల్లో నడుద్దాం

# లంకమల దారుల్లో..

అమ్మ యెక్కడికి వెళ్లింది? యెప్పుడు వస్తుంది? అన్న ఆదుర్దా పిల్లలకు వుండటం సహజం.

కట్టెలు కొట్టుకురావటానికి అడివికి వెళ్లింది. కందిరీగలు దాడి చేస్తే పడిపోయింది. అమ్మను చూడటానికి వెళ్తున్న వారితో వివేక్ తను కూడా అడవిలోకొస్తానన్నప్పుడు చిన్నపిల్లాడివి వద్దన్నారు. అయిదారేళ్ల పిల్లవానికి అమ్మను గాయపరిచిన అడవిలో యేముందో చూడాలని మనసులో మెదిలిన ఆలోచనను మర్చిపోకుండా పదే పదే జ్ఞాపకం చేసుకోవటం రచయిత జన్మ రహస్యం. బాల్య కుతూహలంతో అన్వేషకులై వివేక్ ప్రపంచానికిచ్చిన కాన్క లంకమల దారుల్లో...

కొవిడ్ లాక్‌డౌన్ రోజులు వొక అవకాశం మాత్రమే. స్నేహితులు కూడిరావటం వొక సందర్భం మాత్రమే.యేముంది అడివిలో? యెప్పుడో యెవరో మనుషులు నడిచిన దారుల ఆనవాళ్లు వున్నాయి. మూసుకుపోతూన్న డొంకలున్నాయి. చీలిపోతూన్న బాటలున్నాయి. వొంటరితనాన్ని కావలించుకున్న మనుషులున్నారు. మడుగులున్నాయి. యెండిపోతున్న వాగులున్నాయి. గుహలున్నాయి. గద్దలు వాలే బండ రాళ్లున్నాయి. యెప్పుడో, యెవరో వివరించి రాయగా మనసుకు హత్తుకున్న పద చిత్రాలు, విశ్లేషణలు గుర్తుతెచ్చే చోట్లున్నాయి.




నడక వొక ప్రతీక. అమ్మను వెతుక్కుంటూ పిల్లవాడి నడక, మమకారాలను వదులుకుని బుద్ధుడు నడిచిన నడక, తండ్రి మాట కోసం అడివికి వెళ్లిన రాముడి నడక, మక్కా నుంచి మదీనాకు పైగంబర్ నడక, సబర్మతి ఆశ్రమం నుంచి దండి వరకు మహాత్మాగాంధీ నడక! నడిచే మనుషులు తమ కన్నా ముందు నడిచిన మనుషుల ఆనవాళ్లు వెదికి పట్టుకుంటారు. కొత్త ఆనవాళ్లు వదులుతారు. అలా యిప్పుడీ వివేక్ లంకమల దారుల్లో అందించిన ఆనవాళ్లు అపురూపమైనవి.

లంకమల దారుల్లో వివేక్ నడవటం, ఆ దారులను ప్రేమగా హత్తుకుని మననం చేసుకోవటం, అలా మననం చేసుకున్నది మనతో పంచుకోవటం వీటికి వొక చారిత్రక భౌగోళిక సందర్భం వుంది. మనకు సమకాలీనులైన మనుషులు మన సామూహిక చరిత్రను తరచి తరచి చూసి మనకు చెప్తున్న కొత్త కథలు. యివి ముందుతరాల వాళ్లకు వూతనిస్తాయి. వాళ్లు చెప్పుకోవాలసిన కతలకు ఆధారాలను అందిస్తాయి. లంకమల దారుల్లో వొక్కో చాప్టర్ నీలిప్రవాహాలు, పిట్టల మకరంద సవ్వడులు, అడవిపువ్వుల సౌరభాన్ని పెనవేసుకున్న మౌన శిలలు, మార్మిక శ్వాసల లిపి గుహలు, ఆకలిని తీర్చే ఆత్మీయ చేతులు యిలా ఆరు రుతువుల అడవి లయ కాంతిమయ సౌందర్యం మన చూపులను ముగ్ధులను చేస్తుంది. దారుల్లో పోగుపడిన ప్లాస్టిక్‌ను చూసి వివేక్ నో ప్లాస్టిక్ లంకమల అని గొంతెత్తటం.. ఆచరణలోకి తీసుకురావటం చూస్తే ప్లాస్టిక్ లేని పరిసరాలకై నడవాలనే స్ఫూర్తినిస్తుంది.

లంకమల దారుల్లో చదువుతున్నంత సేపు యేవో కొత్త మాప్‌లు మనసులో యేర్పడుతుంటాయి, ఆయా ప్రాంతాలకు సంబంధించిన రూపాన్ని ఫీచర్స్‌ని చాలా వివరంగా చెప్తారు వివేక్. లక్ష్యమున్న నడక. బిభూతీ బాబు యుగళ ప్రసాద్‌లా వనదారుల భాష తెలిసిన వివేక్ తను దర్శించిందంతా అక్షరాలుగా విరబూయించారు.

నడకంటే వేసే ప్రతీ అడుగు మన లోపలకీ మనం అడుగైటమని... దారంతా పంచేంద్రియాలని విప్పార్చుకోవటమని, దారుల్లోని మనుషులకు పరిచితంగా అవ్వాలని మనకు ప్రేమగా అవగతం చేస్తుంది లంకమల దారుల్లో. తెలుగు మాట్లాడే ప్రతి జిల్లాలో యిలా నడిచిన నడుస్తున్న మనుషులందరిదీ వొకే భాష. అది చలన శీలత్వం నుంచి వచ్చిన భాష. మనలోని చదువరి దాహం వారంతా వారివారి నడకని రాస్తే బాగుండునను కొంటుంది వివేక్ బాహ్య ఆంతరంగిక భావుక సమ్మిళిత నడక లంకమల దారుల్లోకి చదివాక.



కుప్పిలి పద్మ

వైవిధ్యభరితమైన సంప్రదాయాన్ని కలిగిన పంజాబీ సూఫీ కవితా రంగంలో, మార్మిక కవి అయిన హజ్రత్ సుల్తాన్ బహు (1631-1691) పేరు కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. మొదట ఆయన అబ్దుల్ ఖాదిర్ జిలాని స్థాపించిన ఖద్రియా సంప్రదాయాన్ని అనుసరించారు. తర్వాత సర్వారీ ఖాద్రి అనే కొత్త సంప్రదాయాన్ని నెలకొల్పారు. పార్శీలో 140కి పైగా గ్రంథాలను బహు రచించారు. ప్రయాసతో, శాస్త్రబద్ధతతో ఆలంకారికతతో కూడుకున్న పార్శీ సూఫీ కవిత్వానికి, ఐహికత నిండిన అణకువ గల ముతకతనమున్న పంజాబీ సూఫీ కవిత్వానికి మధ్య వారధిలాంటి వాడు బహు.


# అబ్యాత్‌కు ఆద్యుడు.. సూఫీ కవి బహు

పంజాబీ సూఫీ కవిత్వం సామాన్య పంజాబీ రైతులను బాగా అలరించింది. పార్శీ, సిరైకి భాషలో సుల్తాన్ బహు ఎన్నో గ్రంథాలను రచించినా, ప్రజలు అతని పంజాబీ కవితా రూపమైన 'అబ్యాత్'నే ఎక్కువగా ఇష్టపడతారు. తమ స్మృతిలోనూ భద్రపరచుకున్నారు. అతని కవిత్వ భాష సామాన్యుల భాషకు చాలా దగ్గరగా ఉంటుంది. అందుకే ఆయన వివిధ ప్రాంతాల, మతాల ప్రజలకు ప్రీతిపాత్రుడయ్యారు. సిరైకి అనే భాషలోనూ ఆయన రాసిన కవిత్వం, వచనం, పాటలు మొదలైనవి వెలువడ్డాయి.

బహు కవిత్వంలోని సంగీతం, ఉపమాన రూపక అలంకారాలు సాహిత్యాభిమానులను అలరిస్తాయి. ఇవన్నీ సామాన్య పంజాబీ ప్రజల మౌఖిక సంప్రదాయానికి, సాహిత్యానికి దగ్గరగా ఉంటాయి. సులభంగా అర్థమయ్యే విధంగా కూడా ఉంటాయి. అంతేకాకుండా ప్రాపంచికతను నింపుకోవటంతో ఆయన ప్రజలతో మమేకమయ్యారు. అంటే ఒకవిధంగా ఆటవెలదులు, తేటగీతులలో రాసిన మన వేమనలాగా అన్నమాట. బహు రాసిన అబ్యాత్‌లు స్వచ్ఛమైన ఆధ్యాత్మిక బోధనలను, సూఫిజాన్ని ప్రతిబింబిస్తాయి. అతని కవితలను కాఫీ, కలాం, ఖవ్వాలీ మొదలైన ఎన్నో ప్రక్రియలలో, పద్ధతులలో, శైలులలో పాడుకుంటారు ప్రజలు. పాండిత్యం కన్నా సూఫీ తత్వాన్ని తనలో ఎక్కువగా రంగరించుకున్న బహు హృదయ స్వచ్ఛత, ఆత్మజ్ఞానం, ఋజువర్తనం, విశ్వప్రేమలను కవితా వస్తువులుగా ఎంచుకున్నారు. వాటిలోని సౌందర్యం, మార్మికత పాఠకులను తమ ఆధీనంలోకి తెచ్చుకున్నాయి.



ఆధ్యాత్మిక గురువు పట్ల తనకున్న అపారమైన గౌరవం మొదలుకొని, పాండిత్యంతో నిండిపోయి వ్యవస్థీకరించిన మతం వరకు.. అన్నీ ఆయన కవితా వస్తువులే. సూఫీ మత సిద్ధాంతాల ప్రకారం నిర్వచించిన ప్రేమ గురించి తన కవితలలో ఎంతో ఉత్సాహంగా రాశారాయన. 'హు' అనే అక్షరాన్ని తన కలం పేరుగా, పల్లవిగా వాడటం వల్ల ఆయన ప్రత్యేకతను పొందారు. అతని 'ద్విపద'లను వివిధ సంగీత శైలులలో ప్రజలు పాడుతారు. ఆయన రాసిన అబ్యాత్‌లను గానం చేసే తీరు ఇతర కవితా రూపాలను పాడే విధానానికి చాలా భిన్నంగా ఉంటుంది. సమృద్ధమైన తన మార్మిక కవితా సంప్రదాయాన్ని, వారసత్వాన్ని మనకు అందిస్తూ తన 63వ ఏట దివంగతుడయ్యారు బహు. షోర్కోట్‌లోని చీనాబ్ నదీ తీరంలో ఉన్న అతని సమాధిని ఖాద్రీలు, పంజాబీ సూఫీ కవిత్వ ప్రేమికులు ఆనందోత్సాహాలతో దర్శిస్తుంటారు. సుల్తాన్ బహుకు ఆధ్యాత్మిక గురువైన షేక్ అబ్దుల్ ఖాదిర్ జిలానీ స్వస్థలం బాగ్దాద్. ఆ నగరంతో గాఢమైన మానసిక బంధాన్ని నెలకొల్పుకొన్న బహు దాన్ని ఒక్కసారైనా భౌతికంగా దర్శించలేదు.



ఎలనాగ

### శరీర నేత్రం

నా శరీరం ఒక పెద్ద నేత్రంగా మారినా పోయేదేమిటి!
అలసిపోకుండా నా ఆధ్యాత్మిక గురువును
దర్శిస్తూనే ఉంటాన్నేను
నా చర్మం మీది సూక్ష్మరంధ్రాలన్నీ
రెప్పలు వేసే లక్ష చక్షువులుగా మారితే
కొన్నిటిని మూసి మరికొన్నిటిని తెరుస్తాను
అంతటి అవలోకనం తర్వాత సైతం
ఇంకా తహతహలాడుతూనే ఉంటాన్నేను
అరెరే, ఏం చేతును, ఎక్కడికి పోదును?
బహూ! నీ ఆధ్యాత్మిక గురువును దర్శించటం
లక్ష తీర్థయాత్రలకు సమానం నీకు...

'బహు'కవితకు రచయిత అనువాదం..

### ఆహ్వానం

## వర్తన రెండో సమావేశం

సాహిత్యరంగంలో నవీన ధోరణులు పాదుకొల్పాలన్న లక్ష్యంతో ఏర్పాటైన 'వర్తన సాహిత్య సంస్థ' ఆధ్వర్యంలో రెండవ సమావేశం 2024, మార్చి 17న ఆదివారం ఉదయం 10.30 గంటలకు రవీంద్రభారతి సమావేశ మందిరంలో జరుగుతంది. ఈ సమావేశంలో 'కవిత్వ వాస్తవికత' అనే అంశంపై కవి సిద్ధార్థ ప్రసంగిస్తారు. ఈ సమావేశానికి డాక్టర్ రూప్‌కుమార్ డబ్బీకార్ అధ్యక్షత వహిస్తారు. ఒద్దిరాజు ప్రవీణ్‌కుమార్ సమన్వయకర్తగా వ్యవహరిస్తారు. కవులు, రచయితలు, సాహిత్యాభిమానులు అందరూ ఆహ్వానితులే.

- ఒద్దిరాజు ప్రవీణ్‌కుమార్, కార్యదర్శి, వర్తన




## తల్లీ! నిన్ను దలంచి...

నేడు సావిత్రీబాయి ఫూలే వర్ధంతి సందర్భంగా..

ప్రవాహంలో మట్టిగడ్డలా కొట్టుకుపోకుండా
జ్ఞాన శిఖరమై ప్రవాహ గతిని మార్చావు
పాదాలు నెత్తురోడుతున్నా
ముళ్ల కంచెల మీదే ముందుకు నడిచావు
రాళ్ల తుపాను చుట్టుముట్టినా
పేడ ముద్దలు వెక్కిరించినా
అక్షరం దిశగానే చూపు సారించావు...
'ఆకాశంలో సగం' నిండా
ఆవరించిన అమావాస్యలను చెరిపివేసి
శూద్రావనిలో సూర్యోదయమయ్యావు
బడికి 'మడి'గట్టిన ఛాందసవాదాన్ని ధిక్కరించి
ఒడినే బడిగా మలచి
బతుకు విలువను బోధించావు...
పురాతన శృంఖలాలను ఛేదించి
అణగారిన జాతి గొంతులో
విముక్తి గీతమై ప్రతిధ్వనించావు...
మొగ్గకూ మోడుకూ మధ్య అల్లిన పెనుబంధం
పుటుక్కున తెగిపోయినపుడు
రగిలిన వేదనాగ్నిలో రహస్యంగా పురుడు పోసుకున్న
ప్రాణ దీపాలను గుండెలకు హత్తుకున్నావు...
సత్యశోధనా పథంలో
సాంస్కృతిక విప్లవ జ్యోతివై ప్రజ్వలించావు..

కాలం మారింది కానీ
కొత్త కొత్త నేరాలూ ఘోరాలు
ఇంకా బుసలు కొడుతూనే ఉన్నాయి తల్లీ!

ఇప్పుడు మేము తరగతి గదికి బొట్టుపెట్టి
పాఠాలకు పాత రంగులు వేస్తున్నాం
చరిత్ర చెవుల్లో సీసం పోస్తున్నాం
సమన్యాయం నాలుక మీద
కుటిల బీజాలు నాటుతున్నాం
తాళం వేసి, గొళ్లెం మరచినట్టు
సంవిధానాన్ని విస్మరించి
ప్రజాస్వామ్యానికి
తాత్పర్యం వల్లిస్తున్నాం.
కేవలం దేవుడి దయవల్ల
మనిషి అంతరిక్షం మీద
అడుగుపెట్టాడని ప్రగాఢంగా విశ్వసిస్తున్నాం
ఈ తిరోగమన తిమిరంలో...
కొడిగట్టిపోతున్న మాకు
ఇప్పుడు హఠాత్తుగా
ఒక తాత్విక చైతన్యం కావాలి!
తల్లీ! చదువుల జాబిల్లీ!
మమ్మల్ని నీ పాఠశాలలో చేర్చుకొని
పిడికెడు జ్ఞాన భిక్ష పెడతావా? ప్లీజ్...



కోయి కోటేశ్వరరావు
94404 80274




## ఓ భారత సైనికుడా!

నీవు భరతమాతకు తిలకం
కోట్ల ప్రజలకు ధైర్యం
భరతమాతకు ఆత్మజుడవు
దేశం, నీ ఆవాసం వదిలి
దేశం కోసం ఆయువు
ఇవ్వడానికైనా సిద్ధం
దేశం కోసం యుద్ధం చేస్తావు
ఎప్పుడు కూడా కల్ల చెప్పవు!
నీ దేశం కోసం సరిహద్దు దగ్గర కునుకు
తీయకుండ కాపలా కాస్తుంటావ్
నీవు కంఠీరవం లాంటివాడివి
ఓ భారత సైనికుడా!

- గోమాసి సన్నీ
7వ తరగతి, తెలంగాణ సాంఘిక సంక్షేమ
గురుకుల పాఠశాల, కోటపల్లి,
మంచిర్యాల జిల్లా